క్లుప్తంగా

పేదలకు దుప్పట్ల పంపిణీ



పేదలకు దుప్పట్లను అందిస్తున్న మానవత సభ్యులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని రోడ్డుపక్కన నిద్రిస్తున్న పేదలకు ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం అర్ధరాత్రి మానవత సభ్యులు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవత చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి, కోశాధికారి మల్లిఖార్జునరెడ్డిలు పాల్గొన్నారు.

‘నేడు గడప గడపకు మన ప్రభుత్వం’

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇప్పెంట సచివాలయ పరిధిలోని బోడెద్దులపల్లె గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి. నరేన్ రామాంజులురెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీఓ రవి కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, జడ్పీటీసీ పి. నరేన్ రామాంజులురెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు.

మానవ మనుగడకు చెట్లే శ్రీరామరక్ష



మొక్కలతో ర్యాలీగా వెళ్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కమలాపురం : మానవ మనుగడకు చెట్లే శ్రీరామరక్ష అని పీవీఎస్‌ఆర్‌ఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఆ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి 2వ హెల్త్ క్లినిక్ వద్ద మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలైనా నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శివ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణులకు సలహాలు అందించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి నాగరాజు

చింతకొమ్మదిన్నె : మండలంలోని గర్భిణులకు, బాలింతలకు ఆశా వర్కర్లు సలహాలు, సూచనలను అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.నాగరాజు సూచించారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లతో సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ రాఘవేంద్ర, సునీత, సీహెచ్‌ఓ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాత, శిశు మరణాలను తగ్గించాలి



సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

తొండూరు : ప్రసవం తర్వాత ఇంటి వద్ద అందించే సేవలతో మాత, శిశుమరణాలను తగ్గించవచ్చునని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా పేర్కొన్నారు. మంగళవారం తొండూరు పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సమాజ ఆరోగ్య అధికారిణి రమణమ్మ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ముద్దనూరు : మండలంలోని గంగాదేవిపల్లె సమీపంలో మంగళవారం పేకాట ఆడుతున్న 9 మంది జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5050 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.పాలగిరి సచివాలయ పరిధిలోని నేలతిమ్మాయపల్లె, ఓబుల్‌రెడ్డిపల్లె, మర్రిపల్లె, గోనుమాకులపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపై ప్రజలను అడిగి తెలుసుకోవడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు, సిమెంటు రోడ్లు, భూముల సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పసరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు నరేన్ రామాంజులరెడ్డి, రాష్ట్ర మైనింగ్, సివిల్ సప్లై డైరెక్టర్లు వీరప్రతాప్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, నాయకులు వీరయ్యయాదవ్, విజయ్‌కుమార్ యాదవ్, రాజమ్మ, శంకర్‌రెడ్డి, గోవిందరెడ్డి, సురేంద్రకుమార్‌యాదవ్, పుల్లారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా పింఛన్లు మంజూరు చేయాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు. వీరపునాయునిపల్లె మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల అబివృద్ధి అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పింఛన్ వారోత్సవాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగిన చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల కష్టాల గురించి ఏనాడు పట్టించుకోలేదన్నారు. వయస్సులో చిన్నవాడైనా దూరదృష్టితో ఆలోచించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడేనన్నారు. నవరత్నాల వలన ప్రతి ఒక్క కటుంబానికి లబ్ధి చేకూరుతోందన్నారు. మీ అందరి ఆశీర్వాదం జగన్‌మోహన్‌రెడ్డికి కావాలని ఆయన కోరారు.



పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

లబ్ధిదారుల పత్రాల పరిశీలన



లబ్ధిదారుల పత్రాలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

జమ్మలమడుగు రూరల్ : స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం ఒక ఏకరా భూమి కోల్పోయిన లబ్ధిదారుల పత్రాలను అధికారులు మంగళవారం పరిశీలించారు. మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె, సిరిగేపల్లె గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పర్యటించారు. సుమారు ఒక ఏకరా భూమి గల లబ్ధిదారులు 379 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల అధార్‌కార్డులు, పట్టా పాస్‌బుక్‌లు తదితర వాటిని అధికారులు పరిశీలించారు. ఇందులో 134 మంది లబ్ధిదారుల పత్రాలు సవ్యంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జహీర్, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌తో నిరుద్యోగులకు ఉపాధి



ప్రభుత్వ పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : స్టీల్‌ప్లాంట్ నిర్మాణంతో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గూడెం చెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని సున్నపురాళ్లపల్లె-పెద్దదండ్లూర్ గ్రామల మధ్యలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరుగనున్నదని దీంతో కొన్ని వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన నిరుద్యోగులకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమపథకాలు ప్రతి కుటుంబానికి అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జారి నాగేశ్వరి, ఎంపీటీసీ లక్ష్మీదేవి, తహసీల్దార్ రవీంద్రారెడ్డి, ఆర్‌ఐ జహీర్ వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరెడ్డి, సంజీవరాయుడు, రమణయ్య యాదవ్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు



వేంపల్లెలో పూలే చిత్ర పటానికి పూలమాలవేస్తున్న ప్రిన్సిపాల్

పులివెందుల టౌన్ : మహిళా ఉపాధ్యాయురాలుగా సమాజంలో మహిళలకు ఉచిత విద్యను అందించడంతోపాటు సమాజాకి దురాచారాలైన సతీసహగమనం, మహిళా అవిద్య, మూఢ నమ్మకాల రూపుమాపడానికి సావిత్రిబాయి పూలే ఎంతో కృషి చేసి చిరస్మరణీయురాలుగా నిలిచిందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఆమె జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చాంబర్‌లో పూలే చిత్ర పటానికి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అలాగే స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే స్థానిక ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల భవనంలో పూలే చిత్ర పటానికి వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, తదితరులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వికలాంగులకు స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన కార్యదర్శి ప్రశాంత్, వైఎస్సార్సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాజా, ఏపీఎం ఆంజనేయులు, ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం నియోజకవర్గ ఎస్సీ వింగ్ చైర్మన్ మురళీకృష్ణ, సీఐటీయూ నాయకులు గఫూర్, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. పూలే చిత్ర పటానికి ప్రిన్సిపాల్ యోగాంజనేయులు, ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఉమన్ ఎంపవర్‌మెంట్ కో ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో. ఆర్డినేటర్ ఓబుళరెడ్డి, పాఠశాల హెడ్మాస్టర్ దస్తగిరి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను పునరుద్ధరించండి



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నగరిగుట్ట, బేతేలు చర్చి, భాకరాపురం తదితర ప్రాంతాలలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భాకరాపురంలో పైపులైన్ మరమత్తు కారణంగా మూడు రోజులుగా నీటి సరఫరా జరగలేదని.. వెంటనే పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టి నీటిసరఫరాను పునరుద్ధరించాలన్నారు. పైపులైన్ మరమ్మతు పనులలో నిర్లక్ష్యం వహించిన పబ్లిక్ హెల్త్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన మందలించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఇళ్ల నిర్మాణ పనులపై పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ సమీక్షకు సంబంధిత అధికారులు తగిన నివేదికలతో హాజరు కావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించండి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ హాలులో వార్డు సచివాలయ అమెనిటీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయాల పరంగా అమినిటీ సెక్రటరీలకు నిర్దేశించిన అక్రమ కొళాయి కనెక్షన్లను గుర్తించి ప్రజలచేత రెగ్యులర్ చేయించాలన్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి పనిని విధిగా పరిశీలించాలన్నారు. ముఖ్యంగా పార్ట్ హోల్స్, రోడ్డు మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ అమినిటీ సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం విద్యార్థికి తైక్వాండోలో గోల్డ్ మెడల్



పవన్ కుమార్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి

కమలాపురం : స్థానిక సీఎస్‌ఎస్‌ఆర్ అండ్ ఎస్‌ఆర్‌ఆర్‌ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎం. పవన్‌కుమార్ అనే విద్యార్థి తైక్వాండో పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. గతనెల 28న బెంగుళూరులోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన మూడవ ఓపెన్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పవన్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించాడు. కాగా మంగళవారం స్థానిక ఆ కళాశాలలో కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి విజేతగా నిలిచిన విద్యార్థినిని అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ సుమన్ పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతో విత్తనాల ఎంపిక



మూడు రకాల కంది పంటలను పరిశీలిస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్ర ప్రతినిధులు, రైతులు

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో మహిళా రైతు గంగోజమ్మ పాలంలో మేలైన కంది విత్తన ఎంపిక చేయడం, మూడు రకాలైన ఐసీపీఎల్ 87119, జీ176, కొలంబో రకాలతో పీవీటీ కింద సాగు చేయడం జరిగింది. ఈ ఫీల్డ్‌లో సుస్థిర వ్యవసాయ కేంద్ర రాష్ట్ర కో ఆర్డినేటర్లు ఆదినారాయణ, జనార్ధన్‌ల ఆధ్వర్యంలో మూడు రకాల కంది పంటలను పరిశీలించి కొలంబో కంది రకం మంచి దిగుబడి వచ్చే విత్తనంగా రైతులు ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా

కడప అగ్రికల్చర్: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కడప మార్కెట్ యార్డులో చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి అధ్యక్షతన మొదటి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా హాజరై మాట్లాడారు. కడప యార్కెట్ యార్డు ఎంతో పురాతనమైనదని ఇది జిల్లాకే తలమానికం అన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులు పండించిన పంటలను యార్డులో విక్రయించేందుకు వస్తారని వారికి కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలన్నారు. ముఖ్యంగా మార్కెట్ యార్డు అభివృద్ధికి అధికారులతోపాటు పాలకవర్గం సమన్వయంతో కృషి చేసి అభివృద్ధి బాటలో నడిపించాలన్నారు. మార్కెట్‌యార్డుకు ఆదాయ వనరులను పెంచాలన్నారు. రైతులకు, వ్యాపారులకు ఏమి అవసరమో గుర్తించి వాటి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఇందుకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని, అలాగే ప్రభుత్వం నుంచి సహకారం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్‌యార్డులో నిలిచిపోయిన షెడ్డు నిర్మాణ పనులను కూడా ఎంపీ అవినాష్ రెడ్డితో చర్చించి పునఃప్రారంభానికి చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం కడప మార్కెట్ యార్డులో రూ. 450 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి కమిటి సభ్యులు తీర్మాణం చేశారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి, వైస్ చైర్మన్ ఇబ్రహీం మియా, డైరెక్టర్లు మాట్లాడారు.

వదంతులు నమ్మవద్దు



మీడియాతో మాట్లాడుతున్న బలిజ సంఘం అధ్యక్షుడు గురుప్రసాద్, దొరస్వామినాయుడు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో ఉన్న పాళెం దొరస్వామి నాయుడు విగ్రహంపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని పులివెందుల శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ పాఠశాల వద్ద పాళెం దొరస్వామినాయుడు మునిమనువళ్లు బలరాంనాయుడు, శివశంకర్‌నాయుడులతో కలసి మీడియాతో మాట్లాడారు. కొంతమంది స్వార్థ రాజకీయాల కోసం లేనిపోని మాటలు మాట్లాడటం సరికాదన్నారు. అన్ని తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. పాళెం దొరస్వామినాయుడు విగ్రహం పాత పడటంతో దాని స్థానంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలు తెలపడం జరిగిందన్నారు. అవేవీ తెలియకుండా పాళెం దొరస్వామినాయుడు విగ్రహాన్ని చెత్తకుప్పలో వేశారని.. టీడీపీ నాయకులు రాంగోపాల్‌రెడ్డి మాట్లాడటం బాధాకరమన్నారు. పాళెం దొరస్వామి నాయుడు కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు రవి, తోటంశెట్టి హరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణికోటికి సేవలందించడమే ధర్మమార్గం

కడప కల్చరల్ : సర్వప్రాణికోటికి సేవలు అందించడమే ధర్మమార్గమని ప్రముఖ ప్రవచకులు రాళ్లబండి రాఘవన్ తెలిపారు. మంగళవారం ధనుర్మాస పూజల్లో భాగంగా తిరుమల-తిరుపతి దేవస్థానాల ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక బీకేఎం వీధిలోగల శ్రీ కోదండ రామాలయంలో ఆయన తిరుప్పావై ప్రవచనాలు చేశారు. మనిషిలోని ఈర్ష ద్వేషాలు తొలగి, ఉత్తమ గుణాలను పెంచి సర్వమానవాళికి సేవలు అందించడమే ఉత్తమ ధర్మమార్గంలో తిరుప్పావై పాశురాలు చెబుతున్నాయని ఆయన పేర్కొన్నారు. 19వ తిరుప్పావై పాశురం ప్రశస్తి గురించి ఆయన ప్రబోధిస్తూ లోక క్షేమం కోసం చేస్తున్న తిరుప్పావై వ్రతాన్ని అందరూ ఆశీర్వదించాలని కోరారు.




శ్రీలక్ష్మి, గోదాదేవి సమేత శ్రీనివాసునికి ధనుర్మాస పూజలు


అవినీతి రహిత పాలన సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం




వేంపల్లెలో పింఛన్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, మండల కన్వీనర్, తదితరులు



లింగాల : పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాధ, తదితరులు



వేముల : లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేస్తున్న మండల ఇన్‌చార్జి, జెడ్పీటీసీ, ఎంపీపీలు



సింహాద్రిపురం : లబ్ధిదారురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

వేంపల్లె : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ అవినీతి రహిత పాలన అందించడం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రి, మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ మల్లికార్జునరెడ్డి అధ్యక్షతన కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లేందుకు యత్నిస్తున్నారన్నారు ప్రజలందరూ కూడా వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం 219 మంది కొత్త పింఛన్ లబ్ధిదారులకు వారు పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు మెహతాజ్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

లింగాల : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను బోనాల గ్రామ సర్పంచ్ రాధ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిరంజన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంజీవ్, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వేముల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో కొత్తగా మంజూరైన పింఛన్లను వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవిలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు లీలావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : స్థానిక సచివాలయం-1 పరిధిలో పింఛన్ వారోత్సవాల కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి పింఛన్ దారులతో కలిసి కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం 28 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ రామ్మోహన్, ఎంపీడీఓ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి హరికిశోర్, వెలుగు ఏపీఎం మంజునాథ, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు, ప్రజలు పాల్గొన్నారు.